# ఎంత ఘాటు ప్రేమయో!

బుల్లెబ్బాయంటే చవట సన్నాసేం కాదు. 'లా' చదివాడు!

స్త్రీ స్వాతంత్ర్యం... సమానహక్కులు... మహిళా రిజర్వేషన్ వంటి వాటిలో ఉపన్యాసాలివ్వగల సత్తా వున్న బుల్లి సంఘ సంస్కర్త!

సహధర్మచారిణిని అపురూపంగా చూచుకోవాలనేది బుల్లెబ్బాయి థియరీ!

పెళ్ళి అయిన క్షణంనుంచీ సహధర్మచారిణిని అపురూపంగా అరచేతుల్లో మరీ నడిపించాడు. కాలు కింద పెట్టనిచ్చేవాడు కాదు.

ముద్దెట్టుకుంటే పెళ్ళాం మాసిపోతుందేమోనని... పిల్లల్ని కంటే ముసలితనం వచ్చేస్తుందనేది అతగాడి ఫీలింగ్.

వకీలుగా ప్రాక్టీసు పెట్టి లక్షలార్జించాల్సిన అవసరమేలేదు. డబ్బుకోసం అర్థమైన కేసులూ టేకప్ చెయ్యడు.

ఆడవారికి సంబంధించిన కేసులు మాత్రమే స్వీకరిస్తాడు. వాదిస్తాడు. గెలుపు సాధిస్తాడు.

'స్త్రీ వాది' అని... 'మహిళా పక్షపాతి' అని అతగాడికి ప్రచారంలో ఉన్న మారుపేర్లు...! బిరుదులు...!

ఆస్తిపాస్తులకేం కొదువలేదు. పొలాలు... తోటలు... నగ-నట్రా... నగదు... లాకర్స్‌లో గోల్డు ఇంకా ఎన్నో బోలెడున్నాయ్.

తాతగారికి చదువు అబ్బలేదు. తండ్రి వీధిబడికెళ్ళి అయిదో తరగతి వరకు చదివి ఇక చాలనుకుని 'ఫుల్‌స్టాప్' పెట్టాడు.

దానధర్మాల్లో పేరున్న వంశం!

సిరిసంపదలకు నిలయమైన ఆ ఇంట పుట్టిన ఒకే ఒక్క సంతానం బుల్లెబ్బాయి! అపురూపంగా పెరిగాడు. శేషమాంబ పన్నెండు కాన్పులు కనగ బతికి బట్టకట్టిన నలుసు బుల్లెబ్బాయి ఒక్కడే!

చేతులు పిసుక్కుంటూ బిళ్ళ బంట్రోతులాగ ఉద్యోగం చేయటం బుల్లెబ్బాయికి బొత్తిగా గిట్టని విషయం.

ఒకరోజు ఆడపిల్లల తండ్రినంటూ ఓ పెద్దాయన వచ్చి పెద్దకుమార్తె పెళ్ళి ఖాయమైందని

చెప్పి ఆర్థిక సాయాన్ని కోరాడు.

బుల్లెబ్బాయి తండ్రి క్షణం ఆలోచించి ఓ షరతు పెట్టారు. కన్యాదానం తాము చేయదలిచామని... కన్యాదాన ఫలం ఆడపిల్లలేని తమకే దక్కాలనేది పెద్దాయన వాదన!

అంతకంటేనా అని ఎగిరి గంతేశాడు ఆ వచ్చిన ఆడపిల్లల తండ్రి.

పెళ్ళిఘనంగా జరిపి కన్యాదాన ఫలం దక్కించుకున్నారు దశరథరామయ్య, శేషమాంబలు.

పెద్దపిల్ల వివాహ సమయంలో అతగాడి రెండో అమ్మాయిని చూడటం తటస్థించింది.

రెండవ అమ్మాయి పేరిందేవి అన్నివిధాల నచ్చటంతో బుల్లెబ్బాయికి పైసా కట్నం లేకుండా చేసుకుంటామన్నారు.

ఆడపిల్ల తండ్రి వీరి నిర్ణయానికి కట్టుబడి యస్సనేశాడు.

పేరిందేవి అందాలరాశి కావటంతో టక్కున వప్పేసుకున్నాడు బుల్లెబ్బాయి.

చదువు పెద్దగా లేకపోయినా రూపసి... అందాల భరిణె వంటి పేరిందేవి తన అర్ధాంగి అయినందుకు బుల్లెబ్బాయి బులపాటం తీరింది.

శోభనం నాడే పేరిందేవికి సర్వోపచారాలూ చేయటం మొదలుపెట్టాడు. కొత్త పెళ్ళికూతురుని తన చేతులతో పూలతో అలంకరించిన పందిరిమంచం దాకా నడిపించాడు. వెండి గ్లాసు ఆమె మెత్తటి పెదాలకు తాకించి పాలు తాగించి తృప్తి పడ్డాడు. స్వీట్లు నోటికి అందిస్తూ మురిసిపోయాడు.

ఇంతలో కరెంట్ పోయింది. పవర్ కట్టో... ఫెయిల్యూరో అర్థంకాకపోయినా... అంతరాయానికి చింతించక గుండెనిండా ఊపిరి పీల్చుకుని మహదానందం పొందాడు. రాత్రంతా చీకట్లోనే గడిపారు కరెంట్ రాకపోవటంతో. ప్రతిరోజూ ఇలాగే కరెంట్ లేకుండా పోతూంటే ఎంత బావుండు అన్పించింది.

మూడు నిద్రల తంతు ముగిసేవరకు పేరిందేవిని పందిరిమంచం దిగనీయలేదు.

తాను పాచిముఖం కడుక్కోకుండానే భార్యకి వేడి వేడి 'మిల్క్'లో 'హార్లిక్స్' కలిపి తీసుకొచ్చి ఇచ్చి తనవితీరా తృప్తి పడ్డాడు.

వేళకి భోజనం సైతం వెండికంచంలో తీసుకొచ్చి కలిపి ముద్దలు చేసి పెళ్ళాం నోటికి అందిస్తూ పరమానందభరితుడయ్యేవాడు.

★★★★★

పెళ్ళై నాలుగేళ్ళయినా పేరిందేవి కడుపు పండకపోవటంతో అత్తగారైన శేషమాంబకి

వళ్ళు మండిపోయింది.

పైగా... ఇన్నేళ్ళ కాపురంలో పేరిందేవి వంటింట్లోకొచ్చి 'స్టౌ' వెలిగించిన పాపాన పోలేదు. ఇంట్లో చిన్నమెత్తు పనీ చేసేది కాదు. అయినా సహించింది. ఓర్పు వహించింది. కోడలిని పల్లెత్తు మాట అన్లేదు.

కానీ... వంశాంకురాన్ని అందించకపోవటంతో చిర్రుబుర్రులాడక తప్పలేదు శేషమాంబకు.

బుల్లెబ్బాయి చెవిలో జోరీగలాగ తల్లి శేషమాంబ పోరు పెట్టగా పెట్టగా... చివరికి ఎలాగైతేనేం, కారులో పేరిందేవిని లేడీ డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాడు.

కారు పార్కుచేసి వార్డుబాయ్‌ని కేకేసి వీల్‌ఛైర్ తెప్పించాడు.

పేరిందేవి వీల్ ఛైర్లో వచ్చి కూర్చోవటం చూచిన డాక్టర్ సుభద్ర "ఈమె సిక్ పేషంటా?" ఆశ్చర్యపడిపోతూ అడిగింది.

"ఐయామ్ లాయర్ బుల్లెబ్బాయ్. ఈమె నా మిసెస్ పేరిందేవి- చెకప్ కోసం తీసుకొచ్చాను..." బ్రీఫ్ చేశాడు.

"ఓస్! అంతేకదా... వీల్‌ఛైర్లో వస్తేనూ ఇదేమైనా క్రిటికల్ కేసనుకున్నాను..." అనేసి భళ్ళున నవ్వింది లేడీ డాక్టరు.

"నా శ్రీమతి కడుపు పండితే చూడాలని అమ్మ కోరిక..." సిగ్గుతో సగం చచ్చి చెప్పాడు.

"కేసు అర్థమైంది! ఈమెగారిలా రుబ్బురోలులాగా ఒళ్ళు పెంచుకుంటే కడుపెలా వస్తుందీ? ఎనీవే లెటమీ ఎగ్జామిన్..." నోటికొచ్చినట్టు మాట్లాడి, పేరిందేవిని గ్రీన్ కర్టెన్ వెనకాలున్న బెంచీమీద పడుకోమని ఆజ్ఞాపించి ఆయాసపడుతూ ఛైర్లోంచి లేచి తన భారీకాయాన్ని మోయలేక మోయలేక మోస్తూ పేరిందేవిని ఫాలో అయింది డా॥ సుభద్ర.

ఆ దృశ్యాన్ని తనివితీరా చూచిన బుల్లెబ్బాయి... "ఓ డాక్టర్‌గా మీరే వంద కేజీల బియ్యం బస్తాలా వుంటే... ఇంక పేషంట్ల సంగతి వేరే చెప్పాలా! అని మనసులోనే గొణుక్కున్నాడు.

పది నిమిషాలు పోయాక సుభద్ర తిప్పుకుంటూ వచ్చి భారీకాయాన్ని ఛైర్లో కూలేసి "ముందు మీ మిసెస్ బరువు తగ్గాలి? తర్వాతే ట్రీట్‌మెంట్... అండ్రస్టాండ్..." కోర్టు జడ్జిలాగ గద్దించి మాట్లాడింది.

"పెళ్లయిన నాటినుంచీ నా భార్యని కాలు కింద పెట్టనీయకుండా అపురూపంగా చూచుకుంటున్నాను డాక్టర్..."

"అంచేతే గాలి కొట్టిన బెలూన్‌లా తయారైంది..." అక్కడికి తానేమో బలపంలా వున్నట్టు వెకిలినవ్వు నవ్వింది డా॥ సుభద్ర.

'నావళ్ళు... నా యిష్టం!.. మధ్య మీకు దేనికిట?' అనే భావనతో డాక్టర్‌వేపు గుర్రుగా చూసింది పేరిందేవి.

"చూడమ్మా! మార్నింగ్‌వాక్... జాగింగ్... యోగ... డైలీ చేయ్! అట్లా ఓ నాలుగు నెలలు చేస్తేనే నీవు తల్లివి కాగలవు! పాతిక కేజీలైన బరువు తగ్గించుకుని మళ్ళీ వస్తే అప్పుడు మందులు వ్రాసిస్తాను"

'ఆ పన్లన్నీ మీరు చేస్తే ఎంత బావుండు...' గొణుక్కున్నాడు బుల్లెబ్బాయి మనసులోనే.

"ఈసారి వీల్‌ఛైర్లో కాదు... నడుచుకుంటూ రావాలి నావద్దకు... అర్థమైందా..." వెడుతున్న వారిని కేకేసి మరీ చెప్పింది డా॥ సుభద్ర.

ఇంటికొచ్చాక కొడుకు నోరు మెదపకపోవటం చూస్తూ శేషమాంబ వళ్ళు మండిపోయింది. కోడలు కూడా బెల్లం కొట్టిన రాయిలా మౌనం వహించటం చూచి చిర్రెత్తుకొచ్చింది.

"మీరు వెళ్ళిన పని ఏమైందిరా? డాక్టరేమంది?" దీర్ఘాలు తీస్తూ అడిగింది.

"ఆఁ... ఏముంది?... నీ కోడలి చేత రోజూ క్రమం తప్పకుండా దండేలు... బస్కీలు తీయించమని... ఆసనాలు వేయించమనీ... 'మనీ' (అదే ఫీజు) తీసుకోకుండా ఉచిత సలహా ఇచ్చి పంపింది..." వెటకారంగా అన్నాడు.

"ఏమిటో... నువ్వేమంటున్నావో నాకు ఒక్క ముక్క అయినా అర్థమై చావలేదు..." శేషమాంబ విసుక్కుంది.

"అమ్మా! అసలు విషయం చెప్పనా? ఇప్పుడప్పుడే పిల్లా, పీచు వద్దనుకున్నాం. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిస్తున్నాం... అర్థమైందా?"

"అఘోరించకపోయారూ...!?" కోడలిని చూస్తూ గుడ్లురిమింది.

"అదికాదు అత్తయ్యా... పిల్లలు పుడితే నా అందం తరిగిపోయి నేను ముసలిదానిలా అవుపిస్తానట! అదీ మీ అబ్బాయిగారి బెంగ..." పేరిందేవి పెదవి విప్పింది.

"ఓసి నీయమ్మ కడుపు మండిపోనూ... ఇవేం దిక్కుమాలిన ఆలోచనలర్రా? చూడు కోడలా... ఆరునెలలు తిరక్కుండా పండంటి బిడ్డని నా చేతుల్లో పెట్టకపోయావంటే... నీ భరతం పడతాను! ఆలోచించుకో..." గంగవెర్రులెత్తినట్టు మాట్లాడింది శేషమాంబ.

"నువ్వట్లా అంటే 'లా' ఒప్పుకోదే..." దీర్ఘాలు తీశాడు బుల్లెబ్బాయి.

"నువ్వు నోరుముయ్! నే చెప్పింది విన్నావుగా... త్వరలో తండ్రివికా! అంతే!!" తల్లి శాసించింది.

"ఓరి నాయనోయ్... ఓరి దేవుడోయ్... ఇదెక్కడి చావొచ్చి పడ్డదిరా తండ్రో..." అని

శోకాండాలు పెడుతూ సోఫాలో కూలబడ్డాడు.

"ఇక లాభం లేదండీ! కథ క్లైమేక్స్‌కొచ్చింది. అత్తగార్రి అల్టిమేటం విన్నారుగా! ఇక సమిష్ఠిగా కష్టపడక తప్పదు! రేపట్నించే జాగింగ్... రన్నింగ్... జంపింగ్... ఎక్సర్‌సైజింగ్! ఓకేనా!?..." హుషారుగా మాట్లాడింది పేరిందేవి.

"అవన్నీ చేశావంటే 'యాపిల్లా' వున్న దానివి అరటిపండువై పోతావ్- తర్వాత నీ ఇష్టం..." ఆముదం తాగిన వాడిలా ఫేసు పెట్టి అన్నాడు బుల్లెబ్బాయి.

★★★★★

చెప్పిన సర్కస్ ఫీట్లన్నీ పేరిందేవి చేసిందోలేదో గాని... మూడు నెలలు తిరక్కముందే పేరిందేవి నీళ్ళోసుకుంది. ఏడోనెలలో సీమంతం చేసుకుంది. తొమ్మిదోనెలలో పురుడు పోసుకుని ఒకే కాన్పులో ముగ్గురు మగ బిడ్డలకు తల్లై అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తి రికార్డ్ బ్రేక్ చేసింది.

విషయం తల్సుకొని హాస్పిటల్ ప్రాంగణంలో బుల్లెబ్బాయి మూర్ఛిల్లాడు.

'ఎంత ఘాటు ప్రేమయో' కొడుకు కోడలిది... అనేసి పాత సినిమా పాట మనసులోనే 'ట్యూన్' చేసుకున్న శేషమాంబ ముగ్గురు మనుమలకు ఒక్కసారే బామ్మ అయినందుకు మురిసిపోతూ ఎగిరి గంతేసింది!

- సమాప్తం -

*(ఆంధ్రప్రదేశ్ మంత్లీ ఫిబ్రవరి 2007 సంచిక)*